కూరగాయల ధరలు

శేరిలింగంపల్లి: నల్లగండ్లలోని మార్కెట్‌లో కూరగాయల ధరలు ఇలా ఉన్నాయి.. కిలో రూపాయల్లో టమాట–25, పచ్చిమిర్చి–45, బెండకాయ–40, కాకరకాయ–50, దొండకాయ–40, దోస–40, ఆలు–30, చామ60, కీర–40, బీర60, వంకాయ–40, గోకరకాయ–60, బీన్స్–140, బీట్‌రూట్–40, క్యాప్సికమ్–60, క్యాబేజీ–20, క్యారెట్ 50, చిక్కుడు–100, ఉల్లి–25(కేజీ) ములక్కాయలు(2)–10, కాలీఫ్లవర్–(1)–30, సొరకాయ–20 కేజీ, అల్లం –70, వెల్లుల్లి–150.

ఆలయ వార్షికోత్సవ పూజలు

మోతీనగర్: మూసాపేట డివిజన్ పాండురంగనగర్‌లోని దేవదాయ ధర్మదాయ శాఖ శ్రీ ప్రసన్న వేంకటేశ్వర స్వామి ఆలయ 31వ వార్షికోత్సవాల్లో భాగంగా శనివారం వివిధ పూజలు నిర్వహించారు. మహా కుంభస్థానం, అగ్నిప్రతిష్ఠ, అష్టాక్షరీ హోమం, అభి షేకం, ధ్వజారోహణం, పూర్ణాహుతి, నివేదన, తీర్థ ప్రసాద వినియోగము, శ్రీ విష్ణు సహస్ర నామ స్తోత్ర పారాయణం నిర్వహించారు. కార్యక్రమంలో దేవాలయ పాలక కమిటీ చైర్మన్ బుచ్చయ్య, ఆలయ కార్య నిర్వహణాధికారి సుధాకర్, కమిటీ సభ్యులు అనూపమ, నర్సింలు, రామకృష్ణారావు, జనార్దన్‌గౌడ్, మల్లికార్జున్‌రెడ్డి, నాగేశ్వరరావు, అనిల్ కుమార్, ఆచార్యులు తదితరులు పాల్గొన్నారు.

నేడు రామకృష్ణ వెల్ఫేర్ అసోసియేషన్ ఎన్నికలు

ఆల్విన్‌కాలనీ: వివేకానందనగర్ డివిజన్ రామకృష్ణవెల్ఫేర్ అసోసియేషన్ ఎన్నికలు ఆదివారం జరుగనున్నాయి. ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు ఎన్నికలు జరుగనున్నాయి. బస్తీ అభివృద్ధిలో నిరంతరం పాటుపడుతున్న తమ ప్యానల్ అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని అధ్యక్ష అభ్యర్థిగా గడియారం గుర్తుపై పోటీ చేస్తున్న మధు కోరారు. తమ ప్యానల్‌ను గెలిపిస్తే బస్తీని మరింత అభివృద్ధి చేస్తామన్నారు.

రైతుల ఆర్థిక అభ్యున్నతికి కృషి

పటాన్‌చెరు టౌన్: వ్యవసాయ రంగంలో వస్తున్న ఆధునికతను జోడించి అద్భుతమైన ఫలితాలు సాధించవచ్చని ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి అన్నారు. రైతుల ఆర్థిక అభ్యున్నతికి ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలు దన్నుగా నిలవాలని కోరారు. శనివారం పటాన్‌చెరు మండలం రుద్రారం గ్రామ పరిధిలోని పీఏసీఎస్ ఆవరణలో రూ.40 లక్షల నిర్మించిన దుకాణాల సముదాయాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గంలోని రైతులు పండించిన పంటల నిలువ కోసం ఆధునిక గోదాములు నిర్మించామన్నారు. దుకాణాల సముదాయాలు ద్వారా పీఏసీఎస్ లకు ఆర్థిక లభ్యత పెరుగుతుందని తెలిపారు. రానున్న వర్షాకాలంలో అర్హులైన రైతులకు రుణాలు అందించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో హాజరైన పీఏసీఎస్ చైర్మన్ పాండు, మాజీ ఎంపీపీ యాదగిరియాదవ్, గ్రామ మాజీ సర్పంచ్ సుధీర్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీలు హరిప్రసాద్‌రెడ్డి, రాజు, సీనియర్ నాయకులు దశరథ్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, నరసింహారెడ్డి, పాలక మండలి డైరెక్టర్లు పాల్గొన్నారు.

పేదలను అన్నివిధాలా ఆదుకుంటాం

మణికొండ: పేద విద్యార్థుల చదువులు, అనారోగ్యాలు, వివాహాలకు ఆర్థిక సాయంతో పాటు అన్ని విధాలా ఆదుకుంటామని పట్టినా గులపల్లి మాజీ సర్పంచ్ జి.స్వరూప నగేష్ యాదవ్ అన్నారు. శనివారం గ్రామానికి చెందిన బుడల పెంటయ్య కూతురు వివాహానికి రూ. 50 వేల ఆర్థిక సాయాన్ని ఆమె అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... మనకు ఉన్న దాంట్లో కొంత లేని వారికి ఇస్తే మానసిక సంతృప్తి మిగులుతుందన్నారు. ఇలాంటి సేవా కార్యక్రమాలు రాబోయే రోజుల్లోనూ నిర్విరామంగా కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఎలాంటి ఇబ్బందులున్నా పేదలు తమను సంప్రదించాలని వారికి తగిన సాయం చేస్తామని ఆమె వెల్లడించారు. ఇప్పటి వరకు వంద మందికి పైగా ఆర్థికంగా ఆదుకున్నామని తెలిపారు.

విద్యార్థుల సంఖ్యను మరింత పెంచుతాం

మణికొండ: ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల సంఖ్యను మరింత పెంచుతామని మణికొండ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నిరంజన్ అన్నారు. శనివారం పాఠశాలలో ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ... ఓ ఐటీ సంస్థ సహకారంతో ఉన్నత పాఠశాలలో అదనపు తరగతుల నిర్మాణం పూర్తవుతోందన్నారు. దాంతో తరగతులతో పాటు సెక్షన్‌లు పెంచి మరింత ఎక్కువ మంది విద్యార్థులను చేర్చుకుంటామన్నారు. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఉపాధ్యాయులను రాష్ట్ర ప్రభుత్వం కేటాయించిందన్నారు. ఒత్తిడి లేని నాణ్యమైన విద్య ప్రభుత్వ పాఠశాలల్లోనే లభిస్తుందని, తల్లితండ్రులు తమ పిల్లలను చేర్పించాలన్నారు. ఈ నెల 12 న విద్యార్థులందరికీ పాఠ్య పుస్తకాలు, నోట్ పుస్తకాలు, స్కూల్ డ్రస్‌లను అందించేందుకు సిద్ధం చేశామన్నారు. రామకృష్ణారెడ్డి, శ్రీరాములు, శ్రవణ్‌కుమార్, గంగాధర్, శివగంగ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.





ఆదిత్యానగర్ కాలనీలో రోడ్లపై పారుతున్న మురుగు

సమస్యలతో సతమతం

మియాపూర్ డివిజన్‌లో అధ్వానంగా రోడ్లు

- పొంగిపొర్లుతున్న డ్రైనేజీ మురుగు
- ఇబ్బందులు పడుతున్న స్థానికులు
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు

జుమియాపూర్: మియాపూర్ డివిజన్ పరిధిలో పలు ప్రాంతాల్లో సమస్యలు రాజ్యమేలుతున్నాయి. గుంతలమయమైన రోడ్లు, రోడ్లపై పారుతున్న మురుగు, పలు సమస్యలతో కాలనీ వాసులు ఇబ్బందులు ఎదుర్కుంటున్నారు. ఫిర్యాదు చేసినప్పుడే అధికారులు నామమాత్రంగా మరమ్మతులు చేసి చేతులు దులుపుకుంటున్నారు. తద్వారా మూణ్నాళ్లకే మళ్లీ సమస్యలు పునరావృతమవుతున్నాయి.

- మియాపూర్ డివిజన్ పరిధిలోని ఆదిత్యానగర్ కాలనీలో కొన్ని నెలలుగా రోడ్లపై మురుగు ప్రవహిస్తోంది. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పైపులైన్ సామర్థ్యం చిన్నదిగా ఉండడంతో పాటు చెత్తాచెదారం చేరి మ్యాన్‌హోళ్లు పొంగి మురుగు రోడ్లపై ప్రవహిస్తుంది.
- నిత్యం రోడ్లపై మురుగు పారడంతో స్థానికులు అందులోంచే రాకపోకలు సాగించాల్సి వస్తుంది.
- కాలనీలో నిర్మాణ సామగ్రి ఇసుక, ఇటుక రోడ్లపైనే వేయడంతో స్థానికులకు రాకపోకలు ఇబ్బందులు తలెత్తుతున్నాయి.
- రోడ్లపై మురుగునీరు ప్రవహించడం, పారిశుద్ధ్య వ్యవస్థ ఉండడంతో కాలనీలో దోమలు వృద్ధి చెంది కంటిమీద కునుకులేకుండా చేస్తున్నాయి. వారానికి ఒక్కసారైనా ఫాగింగ్ చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.
- ఫిర్యాదు చేసిన ప్రతిసారి నామమాత్రంగా మరమ్మతులు చేసి వెళ్తున్నారే తప్ప శాశ్వత పరిష్కారం చూపడం లేదు.
- కాలనీలో అండర్ గ్రౌండ్ పైపులైన్ నిర్మాణం కోసం శంకుస్థాపన చేసి రోజులు గడుస్తున్నా పైపులైన్ పనులు మాత్రం ప్రారంభించడం లేదని స్థానికులు వాపోతున్నారు.
- అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి పైపులైన్ పనులను త్వరగా ప్రారంభించాలని, అదేవిధంగా కాలనీలో సమస్యలను పరిష్కరించాలని కోరుతున్నారు.

అలరించిన స్వరార్చన



మాదాపూర్: కళాకారులు స్వరార్చనతో సందర్శకులను అలరించారు. మాదాపూర్‌లోని అన్నమయ్యపురంలో నిర్వహించే అన్నమాస్వరార్చన కార్యక్రమంలో భాగంగా శనివారం శృతిలయ మ్యూజిక్ అకాడమీ గురువు చింతద శివరంజని రామ్ శిష్య బృందంచే స్వరార్చన కార్యక్రమాన్ని నిర్వహించారు. అన్నమయ్య అష్టోత్తరం, మూషికవాహన, ప్రణవస్వరూపం, కట్టెదురా వైకుంఠం, గోవిందాశ్రిత తదితర మధుర సంకీర్తనలను ఆలపించి అలరించారు. కళాకారులు కాశ్యప్, దివిజ, జయశ్రీ, గాయత్రి, ధృవిన్, హర్షిని, హారిక, తరంగిణి, చైతన్య, సాయిప్రణవి, అన్విత తదతిరులు పాల్గొని ఆలపించారు. వీరికి కీబోర్డు సదర్శన్, తబలా శ్రీధర్ వాయిద్య సహకారాన్ని అందించారు. కళాకారులను సంస్థ మేనేజింగ్ ట్రస్టీ డాక్టర్ నందకుమార్, శోభరాజు జ్ఞాపికలతో సత్కరించారు.

ఆకట్టుకున్న నృత్య ప్రదర్శన

మాదాపూర్: కళాకారులు సాంస్కృతిక కార్యక్రమాలను ప్రదర్శించి సందర్శకులను అలరించారు. మాదాపూర్‌లోని శిల్పారామంలో నిర్వహించే వారాంతపు కార్యక్రమాల్లో భాగంగా శనివారం భరతనాట్యం, కూచిపూడి నృత్య ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు. చెన్నైకి చెందిన భరతనాట్య కళాకారిణి రాజేశ్వరీ తన నృత్య ప్రదర్శనతో ఆకట్టుకున్నారు. ఇందులో స్వరజతి, జావళి, అర్ధనారీశ్వరం తదితర అంశాలను ప్రదర్శించారు. శ్రీముఖి నృత్యాలయ నాట్యగురువు మనస్విని కోనూరు శిష్య బృందంచే కూచిపూడి నృత్య ప్రదర్శనతో ఆకట్టుకున్నారు. రంగపూజ, గజవదన బెడువే, జయము జయము, ముద్దుగారే యశోధ, గరుడగమన తదితర అంశాలను కళాకారులు మనస్విని, అంజన, రుక్మిణి, హిమశ్రీ, శ్రీలేఖ, భువన, సహస్ర, హరిణి, దివ్యశ్రీ, ఆరాధ్య, శ్రీనిక, రుత్విక, అన్వీక, విజయశ్రీ, పూర్విక, మాన్విత, హరిహర తదితరులు పాల్గొని ప్రదర్శించారు.





శిల్పారామంలో సాంస్కృతిక కార్యక్రమాలు

ఘనంగా ప్రపంచ పర్యావరణ దినోత్సవం



మాదాపూర్: ఆసుపత్రి ఆరోగ్య సంరక్షణ రంగంలో స్థిరమైన ఆరోగ్య సంరక్షణ పద్ధతులు పర్యావరణ బాధ్యతను ప్రోత్సహించే లక్ష్యంతో ముందుకు సాగాలని పబ్లిక్ హెల్త్ ఫౌండర్ ఆఫ్ ఇండియా వ్యవస్థాపక అధ్యక్షుడు పద్మభూషణ్ డాక్టర్ కె.శ్రీనాథ్‌రెడ్డి తెలిపారు. మాదాపూర్‌లోని హైటెక్ సిటీ యశోద ఆసుపత్రిలో శనివారం ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని నిర్వహించారు. యశోద హాస్పిటల్స్ సహకారంతో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పలు ఆసక్తికర అంశాలను చర్చించారు. గ్రీన్‌హెల్త్ కోసం తీసుకోవాల్సిన చర్యలు ఆరోగ్య సంరక్షణ నిపుణుల నుంచి స్థిరమైన పద్ధతులను అనుసందానించడానికి భవిష్యత్తు తరాలకు ఆరోగ్యకరమైన సమాజాన్ని అందించే విధంగా పలువురు ప్రసంగించారు. హరిత కార్యక్రమాలను అభ్యసిస్తున్న ఆసుపత్రులకు అవార్డులను అందజేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సతీష్‌రెడ్డి, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ దిలీప్ బానుశాలి, యశోద హాస్పిటల్ మెడికల్ సర్వీసెస్ డాక్టర్ లింగయ్య, డాక్టర్లు రమేశ్, రజనికుమారి, అమితారామి పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

పటాన్‌చెరు: అమీన్‌పూర్ బీజేపీ కార్యవర్గం శనివారం ఆ పార్టీ మండల అధ్యక్షుడు ఈర్ల రాజుముదిరాజ్ ఆధ్వర్యంలో బీజేపీ మండల కార్యవర్గం నిర్వహించారు. ఈ సమావేశంలో అమీన్‌పూర్ బీజేపీ మండల కమిటీని 12 మంది పదాధికారులు, 33 మంది సభ్యులతో కలిపి మొత్తం 45 మంది సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా నాయకులు అంజిరెడ్డి, ఆంజనేయులుగౌడ్ పాల్గొన్నారు.

13న స్పాట్ కౌన్సిలింగ్

జిన్నారం (పటాన్‌చెరు): జిన్నారం మండల కేంద్రం సమీపంలోని గురుకుల కళాశాలలో ఎంపీసీ, బైపీసీ కోర్సుల్లో మిగిలిన సీట్లకు ఈనెల 13న స్పాట్ కౌన్సిలింగ్ నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ వెంకటనారాయణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్టీ విద్యార్థులు మాత్రమే హాజరుకావాలని అడ్మిషన్ కోసం అభ్యర్థులు 13న ఉదయం 10 గంటల వరకు గిరిజన గురుకుల పాఠశాల సంబంధిత సర్టిఫికెట్లతో రావాలని ప్రిన్సిపాల్ సూచించారు.

విద్య, వైజ్ఞానిక శిక్షణ తరగతులను జయప్రదం చేయాలి



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న నాయకులు

మియాపూర్: రాష్ట్రస్థాయి విద్య, వైజ్ఞానిక శిక్షణ తరగతులను జయప్రదం చేయాలని ఏఐఎఫ్‌డీఎస్ రాష్ట్ర గ్రేటర్ హైదరాబాద్ కన్వీనర్ ముత్తెన్నగారి శ్రీకాంత్, రాష్ట్ర అధ్యక్షుడు పల్లె మురళి అన్నారు. మియాపూర్ ఎంఏనగర్‌లో నిర్వహించే శిక్షణ తరగతుల కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..అఖిలభారత ప్రజాతంత్ర విద్యార్థి సమైక్య రాష్ట్రస్థాయి శిక్షణ తరగతులను ఈ నెల 9,10వ తేదీల్లో హైదరాబాద్ మియాపూర్ కేంద్రంగా జరగబోతున్నాయని, కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తెలిపారు. ఈ సమావేశంలో గ్రేటర్ హైదరాబాద్ జిల్లా కమిటీ సభ్యులు వంశీ, దిలీప్, సందీప్ తదితరులున్నారు.

పేదలకు ఆపన్నహస్తం సీఎంఆర్‌ఎఫ్



ఎల్‌ఓసీ అనుమతి పత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే

పటాన్‌చెరు: ఆపద సమయంలో సీఎం సహాయనిధి పేదలకు అండగా ఉంటుందని ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి అన్నారు. అమీన్‌పూర్ మున్సిపల్ పరిధిలోని బీరంగూడ జయలక్ష్మినగర్ కాలనీకి చెందిన పున్నయ్య అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఈ క్రమంలో మెరుగైన వైద్య కోసం ఎమ్మెల్యే సహకారంతో సీఎం సహాయనిధికి దరఖాస్తు చేసుకున్నారు. దీంతో మంజూరైన రూ.2లక్షల విలువైన ఎల్‌ఓసీ అనుమతి పత్రాన్ని శనివారం ఎమ్మెల్యే చేతుల మీదుగా పున్నయ్య కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిరుపేదల ఆర్థిక అభ్యున్నతే లక్ష్యంగా సీఎం రేవంత్ రెడ్డి పని చేస్తున్నారని తెలిపారు.

అపరిశుభ్రంగా ఐటీఐ ప్రాంగణం



తరగతి గదులను అనుకుని నిలిచిన మురుగునీరు, పిచ్చిమొక్కలు

- కంపుతో విద్యార్థులకు ఇబ్బందులు
- మరోపక్క అధ్యాపకుల కొరత

రామచంద్రాపురం(పటాన్‌చెరు): రామచంద్రాపురం ఐటీఐ కళాశాలలో విద్యార్థులు అనేక సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారు. ఒకపక్క అపరిశుభ్రత వాతావరణం మరోపక్క అధ్యాపకుల కొరతతో విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. అనేక ఏళ్లుగా సమస్యలతో సతమతమవుతున్న పరిష్కరించే నాథుడే లేరు. పేద విద్యార్థులు చదువుకునే ప్రభుత్వ ఐటీఐ కళాశాలపై జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు ఎందుకు చిన్న చూపుతున్నారో అర్థం కాని పరిస్థితి నెలకొంది.

2002లో కళాశాల ప్రారంభం..

పటాన్‌చెరులో ఐటీఐ కళాశాలను ప్రారంభించారు. అక్కడ సరైన సౌకర్యాలు లేకపోవడంతో 2002లో రామచంద్రాపురంలో నూతన భవనాన్ని నిర్మించి ఇక్కడికి తరలించారు. 2002లో ప్రారంభంమైనప్పటి నుంచి నేటి వరకు విద్యార్థులు సమస్యలతో పోరాడుతున్నారు. గతంలో తరగతి గదుల్లో గచ్చు పూర్తిగా కుంగిపోవడంతో దాతల సహకారంతో మర్మమతులు చేశారు.

170 మంది విద్యార్థులు..

ప్రస్తుతం ఐటీఐ కళాశాలలో 170 మంది విద్యార్థులు 10 ట్రేడ్‌ల్లో శిక్షణ పొందుతున్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యాబోధన అందిస్తున్నా అక్కడి సమస్యలు మాత్రం పరిష్కారం కావడం లేదు.

మురుగు కంపు..

కళాశాల ప్రాంగణంలో తరగతి గదులను అనుకుని పెద్ద ఎత్తున మురుగు నీరు చేరడంతో విద్యార్థులు మురుగు కంపుతో నరకయాతన పడుతున్నారు. దానితో పాటు పిచ్చి మొక్కలు పెరగడంతో విషపురుగులకు, దోమలకు నిలయం మారింది. తరగతి గదిలో విద్యార్థులు కూర్చోలేని పరిస్థితి నెలకొంది.

మురుగు నీరు మళ్లింపు

జాతీయ రహదారిని అనుకుని ఐటీఐ కళాశాల ఉంది. వర్షం పడిన సమయంలో రోడ్డుపై నిలిచిన మురుగనీటిని కొందరు కళాశాల ప్రాంగణంలోకి మళ్లించారు. దీంతో కళాశాల ప్రాగంణమంతా మురుగు నీటితో నిండిపోయింది. ప్రధాన గేట్ ముందు పెద్ద ఎత్తున మురుగు నీరు చేరింది.

అస్తవ్యస్తంగా డ్రైనేజీ వ్యవస్థ..

కళాశాల ప్రాగంణంలో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉంది. దాంతో మ్యాన్‌హోల్స్ వద్ద మురుగు నీరు పొంగిపొర్లుతోంది.

అధ్యాపకుల కొరత..

ఐటీఐ కళాశాలలో 15 మంది అధ్యాపకులు ఉండాలి.. 10 అధ్యాపకులు మాత్రమే ఉన్నారు. దాంతో ఉన్న సిబ్బందే అదనంగా తరగతులు నిర్వహిస్తున్నారు.

దుర్వాసన వస్తుంది



కళాశాల ప్రాంగణంలో మురుగు నీరు నిలవడంతో దుర్వాసన వస్తుంది. దోమలతో ఇబ్బందులు పడుతున్నాం. తరగతి గదులను అనుకుని పిచ్చిమొక్కలు పెరగాయి. అపరిశుభ్రంతో విష జ్వరాలు వస్తాయేమోనని భయపడుతున్నాం. అధికారులు స్పందించి సమస్యను పరిష్కారించాలి.

– సుభాష్, విద్యార్థి

అధికారుల దృష్టికి తీసుకెళ్లాం



కళాశాలలోని సమస్యలను అధికారుల దృష్టికి తీసుకొని పోవడం జరిగింది. త్వరలో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాం.

– శ్రీనివాస్ రావు, ఐటీఐ ప్రిన్సిపాల్

ప్రధాని చిత్రపటానికి క్షీరాభిషేకం



ఆల్విన్‌కాలనీ: మూడు నెలల ముందస్తు రేషన్ ఇవ్వడంపై బీజేపీ నాయకులు శనివారం తులసినగర్‌లోని రేషన్ షాపు వద్ద మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సురభి రవీందర్‌రావు, నరేందర్‌రెడ్డి, కమలాకర్‌రెడ్డి, కుమారచారి, శ్రీనాథ్, సాయి కమల్, కవిత, శ్రీకాంత్, వంశీ, రాహుల్, సిరి, మల్లేష్, సుబ్బారావు, రాఖేష్, మల్లికా, మునీంద్, రాజు తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి కల్యాణ మహోత్సవం

మూసాపేట: భరత్‌నగర్ కాలనీలోని శ్రీహరి హర క్షేత్రంలో కోదండ రామస్వామి ఆలయ శిఖర సంప్రోక్షణ, సీతారాముల కల్యాణం, మహారాజ పట్టాభిషేకం ఈ నెల 9 నుంచి 14వ తేదీ వరకు ఉంటాయని ఆలయ కమిటీ చైర్మన్ నాగిరెడ్డి తెలిపారు. త్రిదండి అహోబిల జీయరు స్వామి మంగళ శాసనములతో త్రిదండి అహోబిల రామానుజ జీయర్ స్వామి ప్రత్యక్ష పర్యవేక్షణలో పూజలు ఉంటాయని పేర్కొన్నారు. సోమవారం అష్టోత్తర కలశాభిషేకం, మంగళవారం సాయంత్రం 6 గంటలకు విష్ణు సహస్రనామ స్తోత్ర పారాయణం, గురువారం విద్యార్థులకు హయగ్రీవ ఇష్టి, శుక్రవారం ఐశ్వర్య సిద్ధికై శ్రీమహాలక్ష్మి ఇష్టి, సాయంత్రం 6 గంటలకు శ్రీ పుష్పయాగం, శనివారం అహోబిల జీయర్ స్వామి కరకమలములచే కుంభప్రోక్షణ, సాయంత్రం భరత్‌నగర్ కాలనీలో హనుమంత్ సేవ రాముల వారి ఊరేగింపు ఉంటుందని తెలిపారు.

భక్తిశ్రద్ధలతో బక్రీద్

చందానగర్/మాదాపూర్: బక్రీద్‌ను శనివారం శేరిలింగంపల్లి జంట సర్కిళ్ల పరిధిలో భక్తిశ్రద్ధలతో నిర్వహించుకున్నారు. ముస్లింలు ఈద్గాలు, మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మాదాపూర్, కొండాపూర్ డివిజన్ల పరిధిలోని ఆదిత్యానగర్, సాయినగర్, ఖానామెట్, మాదాపూర్, ప్రేమ్‌నగర్, న్యూ హఫీజ్‌పేట్, గోపీనగర్, వేముకుంట తదితర ప్రాంతాల్లోని ఈద్గాలు ముస్లింలతో కిటకిటలాడాయి. ప్రతి కాలనీ, బస్తీల్లోని మసీదుల్లో సామూహిక ప్రార్థనలు చేశారు. అనంతరం ఒకరినొకరు ఆలింగనం చేసుకొని బక్రీద్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. సైబరాబాద్ పోలీసులు, మాదాపూర్ డీసీపీ, ఏసీపీ, సీఐలు భారీ బందోబస్తు ఏర్పాట్లు పర్యవేక్షించారు.



న్యూ హఫీజ్‌పేట్ ఈద్గా వద్ద ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



ఒకొరికొకరు ఆలింగనం చేసుకొని శుభాకాంక్షలు తెలుపుకుంటున్న ముస్లింలు



ఆదిత్యనగర్ ఈద్గా వద్ద.. ప్రత్యేక ప్రార్థనల్లో కార్పొరేటర్ జగదీశ్వర్ గౌడ్





ప్రేమ్‌నగర్ ఈద్గా వద్ద..